7
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 23 । జూలై । 2023

న్యూస్‌రీల్

నేడు గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

చింతపల్లి రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే మండలంలో ఆదివారం పర్యటిస్తారని ఐటీడీఏ పీవో అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. లంబసింగిలో నిర్మిస్తున్న ట్రైబల్ మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం చింతపల్లిలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారని పీవో తెలిపారు.

28న రంపచోడవరంలో మెగా జాబ్‌మేళా

అడ్డతీగల: ఏపీనైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ రంపచోడవరం డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కంపెనీలు పాల్గొంటున్న ఈ మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు కలిగి ఇంటర్,డిప్లమో,డిగ్రీ,బీటెక్ ఆపై చదువు పూర్తిచేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఆరోజు నిర్వహించే జాబ్‌మేళాకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 6304634447 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

జగనన్న సురక్షలో 3,222 ధ్రువపత్రాల పంపిణీ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని ఐదు గ్రామ సచివాలయాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. 3,896 ఇళ్ల నుంచి వలంటీర్లు వివిధ ధ్రువపతరాల నిమిత్తం యాప్‌లలలో నమోదు చేసి 3,808 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని ఆయన పేర్కొన్నారు. 3,222 ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్టు ఆయన వెల్లడించారు. 65 దరఖాస్తులు తిరస్కరించగా మిగిలిన ధ్రువపత్రాలను రెండు మూడు రోజుల్లో ఆయా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

రేపు 11చోట్ల శిబిరాలు

జగనన్న సురక్ష పథకం శిబిరాలను సోమవారం 11 గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.చింతపల్లి మండలంలోని చింతపల్లి-1,చింతపల్లి-3, దేవీపట్నం మండలంలోని కొండమొదలు, జి.మాడుగుల మండలంలోని బొయితిలి, సాలభం, గంగవరం మండలంలోని నెల్లిపూడి, హుకుంపేట మండలంలోని దుర్గం, తడిగిరి, కొయ్యూరు మండలంలోని చీడిపాలెం, మఠం భీమవరం, కూనవరం మండలంలోని వెంకటాయపాలెం సచివాలయాల్లో నిర్వహించే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సత్వరం పారిశుధ్య పనులు


మాట్లాడుతున్న డీపీవో కొండలరావు

ఎటపాక: గోదావరి వరదలు, వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని డీపీవో కొండలరావు ఆదేశించారు.శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ డివిజనల్ అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గోదావరి వరదల దృష్ట్యా పునరావాస కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని తెలిపారు. డీఎల్పీవో రాఘవన్, ఈవోపీఆర్డీ చిచ్చడి గంగరాజు పాల్గొన్నారు.

గోదావరి జోరు.. శాంతించిన శబరి

తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్న గోదావరి నీటిమట్టం విలీన మండలాలైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఎగువనున్న భద్రాచలం వద్ద గోదావరి శనివారం ఉదయం వరకు తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో సాయంత్రం నుంచి క్రమేపీ పెరుగుతున్నా.. శబరి నది శాంతించడం విలీన మండలాల ప్రజలకు కాస్త ఊరటనిస్తోంది.

- తగ్గినట్టే తగ్గి పెరుగుతున్న నీటిమట్టం
- విలీన మండలాల్లో ఆందోళన
- ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న వరదనీరు
- తగ్గుముఖం పట్టని వాగులు
- 20 గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు


ఇల్లుకూలిన ఘటనలో గాయపడిన వృద్ధురాలికి వైద్యం అందిస్తున్న సిబ్బంది


కూనవరంలో గోదావరి, శబరి నదుల సంగమం వద్ద నెలకొన్న వరద ఉధృతి


వరద సహాయక చర్యల నిమిత్తం శబరి పరివాహక ప్రాంతంలో అందుబాటులో ఉంచిన లాంచీలు

చింతూరు : చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో గోదావరి, శబరి నదుల వరద శనివారం కొంతమేర తగ్గింది. కాగా గోదావరి మళ్లీ పెరుగుతుండడంతో ఈ మూడు మండలాల్లో కూడా వరద పెరిగే అవకాశముంది.

- చింతూరు మండలంలో శబరినది వరద స్వల్పంగా తగ్గినా వాగుల నీరు ఇంకా రహదారులపైనే ఉంది. అయితే జాతీయ రహదారి-326పై వరదనీరు తొలగడంతో శనివారం ఆంధ్రా, ఒడిశా మధ్య రాకపోకలు కొనసాగాయి.
- సోకిలేరు, చంద్రవంక, చీకటివాగుల వరద ఇంకా రహదారులపై నిలిచి ఉంది. దీంతో వరుసగా మూడోరోజు కూడా చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య, చింతూరు మండలంలోని 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- వరద పెరుగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వరద తగ్గుతుండడంతో ముంపు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, ఫీవర్ సర్వే చేపడుతున్నారు.

ఇల్లుకూలి వృద్ధురాలికి గాయాలు

భారీ వర్షాలకు చింతూరు మండలం చిడుమూరులో దురవా అర్జమ్మ అనే మహిళకు చెందిన తాటాకిల్లు శనివారం కూలిపోయింది. అదేసమయంలో ఇంట్లో ఉన్న తల్లి ముత్తమ్మపై పడడంతో గాయపడింది. స్థానిక వైద్యసిబ్బంది చికిత్స అందించారు.. ఇంట్లోని ఫర్నీచర్ ధ్వంసమైనట్లు బాధితులు తెలిపారు.

వాగుల నీరు పోయే మార్గం లేక..

ఎటపాక: గోదావరి వరద భయం విలీన మండలాల ప్రజలను వీడటం లేదు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం 39 అడుగులకు తగ్గింది. అయితే మళ్లీ క్రమేపీ పెరుగుతూ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 41 అడుగులకు చేరుకుంది. గోదావరి పోటెత్తడం వల్ల వాగుల నీరు దిగువకు వెళ్లే మార్గం లేకుండా ఉంది. ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ముంపు సమస్య కొనసాగుతోంది. గోదావరి వరద భద్రాచలం వద్ద 50 అడుగులు దాటితే వరి నారుమడులు, పత్తి పైరు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నందిగామ,మురుమూరు,తోటపల్లి,నెల్లిపాక వాగుల పరీవాహక ప్రాంతాల్లో వరద ప్రభావం కొనసాగుతోంది.

మూడవ రోజు నిలిచిన రాకపోకలు

కూనవరం: మండలంలోని కొండ్రాజుపేట కాజ్‌వేపై చేరిన వరదనీరు మూడవ రోజు కూడా తగ్గుముఖం పట్టకపోవడంతో టేకులబోరు నుంచి కొండ్రాజుపేట, పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచాలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గినట్టే తగ్గి శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పెరుగుతోంది. సాయంత్రం 6 గంటలకు కూనవరం వద్ద 40.4 అడుగులకు చేరింది. కూనవరంలో శబరి, గోదావరి సంగమం వద్ద సాయంత్రం 6గంటలకు 17.16 మీటర్లు (38.28 అడుగులు) నీటిమట్టం చేరింది.


కొండ్రాజుపేట కాజ్‌వేపై మూడవ రోజు కొనసాగుతున్న వరదనీరు


వరద నీరు చుట్టుముట్టిన సీతంపేటలో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్, ఎస్ఐ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- పీహెచ్‌సీల్లో మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు
- ముంపు గ్రామాల్లో 145 మంది గర్భిణుల తరలింపు
- 64 పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో 128 మంది వైద్యులు
- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా


సీలేరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సీలేరు: ఎపిడిమిక్ సీజన్ కావడంతో జిల్లాలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా అన్నారు. శనివారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లా పూర్తిగా అటవీ ప్రాంతం, గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నందున వ్యాధుల ప్రభావం ఉంటుందన్నారు. ఈనేపథ్యంలో మలేరియా, డెంగ్యూ సోకే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. వీటికి సంబంధించి రక్తపరీక్షలు, మందులు ప్రతీ పీహెచ్‌సీలో అందుబాటులో ఉంచామన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఒక్క మలేరియా కేసు నమోదైనా దాని పరిసర ప్రాంతాల్లో 50 మందికి రక్త నమూనాలను పరీక్షిస్తున్నామన్నారు. వరద ముంపు గ్రామాల్లో 145 మంది గర్భిణులకు పునరావాసం కల్పించి, పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులో ఉంచామన్నారు. ఏజెన్సీలో 'ఫ్యామిలీ డాక్టర్' నూరుశాతం సత్ఫలితాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం వైద్యులు వెళ్లి వైద్య సహాయం అందిస్తున్నారన్నారు. ఏ జిల్లాలో లేనివిధంగా 3,969 మంది ఆశా కార్యకర్తలు ఉన్నారన్నారు. వారి ద్వారా కూడా మంచి వైద్యం గిరిజనులకు అందుతుందన్నారు. జిల్లాలో 64 పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో 128 మంది వైద్యులు ఉన్నారన్నారు. వీరితోపాటు అదనంగా మరో 4 నలుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారని వివరించారు. వైద్యులు విధిగా విధులకు హాజరుకావాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు మస్తాన్ వలి, సౌమ్య, హెల్త్ సూపర్‌వైజర్ జిలాని పాల్గొన్నారు.

విస్తరించిన జీసీసీ వ్యాపారం

- రూ.500 కోట్ల టర్నోవర్
- ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి


పెట్రోల్‌బంకుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న స్వాతిరాణి

రాజవొమ్మంగి: గతంలో ఎన్నడూ లేనివిధంగా తమ ప్రభుత్వ హయాంలో జీసీసీ వ్యాపారం విస్తరించిందని ఆ సంస్థ ఛైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి అన్నారు. శనివారం ఆమె మండలంలోని జడ్డంగి వద్ద జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న పెట్రోల్‌బంక్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వారంరోజుల్లో శంకుస్థాపనకు ఆమె గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అనంతరం స్థానిక జీసీసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జీసీసీ రూ.500 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం జరుగుతోందన్నారు. నాణ్యమైన తేనెతో పాటు సేంద్రియ విధానంలో పండించే పసుపును తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తుండటం జీసీసీ వ్యాపార చరిత్రలోనే మరువలేని ఘట్టం అన్నారు. కొయ్యూరు మండలం డౌనూరులో రూ. 5కోట్ల వ్యయంతో కాఫీ పౌడర్ యూనిట్ నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి అనుమతిలిచ్చారన్నారు. బుట్టాయిగూడెంలో కారం పొడి తయారీ యూనిట్‌ను నెలకొల్పుతున్నట్లు తెలిపారు. గతంలో కిలో కాఫీ గింజల ధర రూ. 80 మాత్రమే వుండేదని, ప్రస్తుతం ఆ ధరను రూ. 285కు పెంచి దాదాపు రూ. 28 కోట్ల విలువైన వెయ్యి టన్నుల కాఫీగింజలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జీసీసీ సబ్బులు, హ్యాండ్ వాష్ తదితర మరో ఐదు ఉత్పత్తులను తయారు చేసే కార్యక్రమం చేపట్టిందన్నారు. వీటికి అవసరమైన మార్కెటింగ్ కూడా పూర్తయిందన్నారు. జీసీసీలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతం రూ.12,500 నుంచి రూ.23,120కు పెంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం హెల్త్‌కార్డులు అందజేసిందన్నారు. జీసీసీలో పనిచేస్తున్న 200 మంది ఉద్యోగులకు సంబంధించి కారుణ్య నియామకాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజనాభివృద్ధి సాధ్యమని ఆమె పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, పీఎసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, కోఆప్షన్‌మెంబర్ కామేష్, జీసీసీ డీఎం జి. పార్వతీశ్వర్రావు, స్థానిక మేనేజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల పరిశోధన



ఎం నిట్టాపుట్టు యూనిట్‌లో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఫ్రాన్స్ విద్యార్థులు

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయంపై పరిశోధన చేస్తున్న ఫ్రాన్స్‌లో దేశ సార్‌బాన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు శనివారం మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా ఎం. నిట్టాపుట్టు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలోని వరి క్షేత్రాలను వారు పరిశీలించారు. శ్రీ విధానంలో సాగు, మార్కెటింగ్ తదితర అంశాలపై సీఈవో గంగరాజు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో పండిస్తున్న పంటలు, మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వాణిజ్య పంటలు, కాఫీ, మిరియం సాగుపై జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి(డీపీఎం) లాలం భాస్కర్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీరామ్ వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం రైతులు సాధికార సంస్థ మండల ఇన్‌ఛార్జీ వెంకట్,ఎం నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జిలు ఎం. ప్రసాద్, పాపారావు పాల్గొన్నారు.

గిరిజనుల జీవితాల్లో వెలుగులు



గిరిజన ఉత్పత్తులతో వ్యాపారం చేసే మహిళలను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర



గిరిజన కళాకారులతో నృత్యం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్న దొర

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో సాధ్యమైంది
- ఉపముఖ్యమంత్రి రాజన్నదొర
- ప్రారంభమైన రాష్ట్ర స్థాయి గిరిజన ఉత్సవాలు



గిరిజన కళాకారుల నృత్యం

బీచ్‌రోడ్డు (విశాఖ): 'గిరిజన ప్రాంతాల్లో వనరులను దోచుకోవడం తప్పితే గతంలో ఏ ప్రభుత్వం కూడా గిరిజనులను పట్టించుకున్న దాఖలాలు లేవు.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించి మా జీవితాల్లో వెలుగులు నింపారు'అని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి పి.రాజన్నదొర అన్నారు. రాష్ట్ర గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గిరిజన పిల్లలు, గర్భిణులు, బాలింతల కోసం అధిక పోషకాలు ఉన్న ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పాడేరులో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయడంతో పాటు గిరిజనుల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టామన్నారు. గిరిజనులకు భూ హక్కు కల్పించడం వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్నారు.వివిధ రంగాల్లో రాణిస్తున్న గిరిజన పారిశ్రామిక వేత్తలను సన్మానించారు.

అలరించిన నృత్యాలు.. ఆకట్టుకున్న స్టాళ్లు

ఐటీడీఏ కేఆర్‌పురం, రంపచోడవరం నుంచి కొమ్ముకోయ నృత్యం, చింతూరు ఐటీడీఏ నుంచి రేల కొమ్ము కోయ నృత్యం, పాడేరు ఐటీడీఏ నుంచి థింసా, పార్వతీపురం ఐటీడీఏ నుంచి కంది కొత్తలు నృత్యం, సీతంపేట ఐటీడీఏ నుంచి సవర తాంగ్సెంగ్ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. గిరిజనులు వివిధ కళాఖండాలను ఇక్కడ ప్రదర్శించారు. గిరిజన క్రాఫ్ట్ వస్తువులు, వెదురు మైనంతో చేసిన ఆట బొమ్మలు, మామిడి పండ్లు, ఆహార ఉత్పత్తులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతి లాల్ దండే, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, టీసీఆర్ అండ్ టీఎం మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



పి.గొందూరులో ఇంటింటా ఓటర్ల సర్వేను పర్యవేక్షిస్తున్న డీఆర్వో అంబేద్కర్

కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం: ఏజెన్సీలోని బూత్ లెవెల్ అధికారులు నెల రోజుల పాటు ఓటర్ల జాబితా సవరణ సర్వే తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలకు సంబంధించిన ఎన్నికల బూత్‌స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గంలో 394 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ఎంత మంది ఓటర్లు ఉన్నారో సర్వే చేసి యాప్‌లో పొందుపచాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉంటే పరిశీలించి సంబంధిత అధికారులకు జాబితాను అందజేయాలన్నారు. సర్వేలో వలంటీర్లనుఎట్టి పరిస్థితుల్లో వినియోగించవద్దన్నారు. కొండ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ఇంటి నెంబరు లేకపోతే వారి జాబితా తహసీల్దార్లకు అందజేయాలన్నారు. బూత్ లెవెల్ అధికారులు సర్వే వివరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సర్వేలో సమస్యలు ఉంటే సబ్ కలెక్టర్, తహసీల్దార్లను సంప్రదించాలని కోరారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పలు సూచనలు చేశారు.

సర్వే పరిశీలన

సాక్షి,పాడేరు: మండలంలోని కిండంగి, వంతాడపల్లి పోలింగ్ బూత్‌ల పరిధిలో శనివారం నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణ ఇంటింటా సర్వేను జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ పరిశీలించారు. తొలగింపు, చేర్పులు, మార్పులపై సర్వే సిబ్బంది పలు సూచనలిచ్చారు. ఓటర్ల గుర్తింపు కార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

వలంటీర్లను ఉపయోగించొద్దు

అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటా ఓటర్ల సర్వే పక్కాగా చేపట్టాలని, సర్వే సమయంలో గ్రామ వలంటీర్లను మాత్రం దూరంగా ఉంచాలని డీఆర్వో అంబేడ్కర్ ఆదేశించారు. పి.గొందూరు గ్రామంలో ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1008 బూత్ లెవెల్ అధికారులు ఓటర్ల సర్వేను చేపడుతున్నారన్నారు. గ్రామ వలంటీర్లను సర్వేకు ఉపయోగించవద్దని ఆదేశించారు.

గిరిజనుల సంక్షేమానికి ఎనలేని కృషి

కొమ్మాది: భారతదేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా జీవో నెంబర్ 46 ద్వారా గిరిజనుల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని గిరిజన సంక్షేమశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడక రాజన్నదొర అన్నారు. రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షన భవన్‌లో శనివారం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జీవో ద్వారా గిరిజన, మైనారిటీ పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భోజనం, తాగునీరు, వసతి భవనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా హాస్టల్స్‌లో మెనూ ద్వారా గిరిజన విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందుతుందన్నారు. అదే విధంగా కుల ధ్రువీకరణ సమస్యలు, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, విద్య, వసతి సౌకర్యాలు, ఆర్టికల్ 275 (1), సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన మిషన్, గర్భిణీ వసతి గృహాలు, బైక్ అంబులెన్స్, వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల నిర్మూలనకు చర్యలు వంటి అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క అధికారి గిరిజనుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా
- ఇద్దరు హెచ్‌ఎంలు, 24 మంది సబ్జెక్ట్ టీచర్లకు షోకాజ్ నోటీసులు



విద్యార్థుల నోట్‌బుక్‌ను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

చింతపల్లి రూరల్: విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంపై దృష్టి పెట్టాలని డీఈవో సలీంబాషా ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడారు. వారి నోట్ పుస్తకాలను పరిశీలించారు. వాటిని కరెక్షన్ చేయకపోవడం, సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోవడంపై ఉపాధ్యాయులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా24 మంది సబ్జెక్ట్ టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు, టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాడు–నేడు పనుల్లో పర్యవేక్షణలోపం, విద్యార్థులకు పెట్టాల్సిన వాటికన్నా ఎక్కువగా గుడ్లు ఉండటంతో రెండు పాఠశాలల హెచ్‌ఎంలకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన వెంటన ఏడీ అప్పారావు నాయుడు, ఎంఈవో వనపల ప్రసాద్ పాల్గొన్నారు.